# మర్యాద ముఖ్యం

**▸రోగులు అందరికీ వైద్య సేవలు అందాలి ▸సిబ్బందితో బాధ్యతగా పనిచేయించండి ▸అదనపు కలెక్టర్ ఆదేశం**



వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు18, ప్రభాత వార్త:** మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని వైద్య సేవలు, రోగుల నమోదు ప్రక్రియ, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ప్రయోగశాల సేవలు, పారిశుద్ధ్యం, రికార్డుల నిర్వహణ తది తర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, మందులు, వివిధ ఆరోగ్య కార్య క్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రోగులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, బయో మెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా నిల్వలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ జిల్లా లోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల నాణ్యతను నిరంతరం పర్య వేక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

**బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ**

**కొడంగల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని బస్తీ దవాఖానాను జిల్లా వైద్య అధికారి(డిఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ సుధాకర్‌లాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం ఆయన బస్తీ దవాఖానాలోని అటెండెన్స్ తీరుపై ఆరా తీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం బస్తీ దవాఖనాలోని మందుల స్టోర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, కాబట్టి సిబ్బంది అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం హస్పిటల్‌లో సేవలు పొందడానికి వచ్చిన పెషెంట్‌లతో మాట్లాడి అన్ని రకాల ఆరోగ్య సేవలు, మందులు బస్తీ దవాఖానాలో అందుబాటులో ఉన్నాయని రోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ కూడా ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడకుండా ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# సమీక్షించే సరిచేస్తాం

**★నిషేధిత జాబితా భూములపై ఆందోళన వద్దు ★ఎవరికీ అన్యాయం జరగనివ్వం ★కలెక్టర్ నారాయణరెడ్డి భరోసా**

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** నిషేధిత జాబితాలో నమోదైన భూముల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22ఏ జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22ఏ జాబితా, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. పాత, కొత్త సర్వే నంబర్లలో మార్పులు, భూముల విభజన, సరిహద్దులు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని అధికారులను ఆదేశించారు. పహాణీలు రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే నంబర్లు, సర్వే రికార్డులు, ఇతర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. ఒక్క రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, అన్ని సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**యూఎల్‌సీ భూములపై ప్రత్యేక పరిశీలన**

పట్టణ ప్రాంతాల్లో గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ)కు సంబంధించిన భూముల రికార్డులను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా జీఓ 765 ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, విముక్తి తదితర అంశాలను పరిశీలించి అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో భూ రికార్డులను సవరించుకోని వారు సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

**హెచ్‌ఎండీఏ పరిధిలోనూ ఇంతే...**

హెచ్‌ఎండీఏ పరిధిలోని భూముల రికార్డులను కూడా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా 22ఏ పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే జాబితాలో ఉంచాలని స్పష్టం చేశారు.

జెన్యూన్ పట్టా భూమి ఏదైనా పొరపాటున 22ఏ జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం అని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహ ద్దులు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డుల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని కలెక్టర్ సి.నారా యణ రెడ్డి స్పష్టం చేశారు.

### ఆన్‌లైన్‌లో క్లియరెన్స్ ఎలా చేస్తున్నారు?

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మంగళవారం మేడ్చల్ జిల్లా అల్వాల్‌లోని సబ్‌రిజిస్ట్రార్ (వల్లబ్‌నగర్) కార్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22ఎ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన ప్రైవేట్ భూముల ఆస్తుల క్లియర్స్‌కు 335 జిఓలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశారని..వాటిని అనుసరించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లింక్ డాక్యుమెంట్స్‌తో వెరిఫికేషన్ చేసుకుని యూఎల్‌సి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియ తీరును కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఆర్డీఓ శ్యాంప్రకాశ్, అల్వాల్ తహసీల్దార్ రాములు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెండింగ్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్



పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ దీపక్ తివారీ, కార్యాలయ సిబ్బంది

## పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

**వికారాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సర్వాయి పాపన్నగౌడ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం హాలు నందు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ముఖ్యతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, మాధవ రెడ్డి, జయపాల్ రెడ్డి, సిపిఓ వెంకటేశ్వర్లు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున గౌడ్, నాయకులు వెంకటయ్య గౌడ్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నివాళి**



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదిరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులు అర్పించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు.

జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చేసిన సేవలను పోరాటాలను వారు స్మరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు చంద్రావతి, వినోద్‌కుమార్, సాంబశివరావు, రేణుకాదేవి, సీతారాం, గంగాధర్, రవీందర్, యాసిన్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో మిషన్ భగీరథ

**540గ్రామాలకు తాగునీటి సరఫరా**

**ముమ్మరంగా రూ.1,422 కోట్ల పెండింగ్ పనులు**

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడి**

**శామీర్‌పేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** మజీద్‌పూర్-ఘనపూర్ గ్రామాల మధ్య మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి తాగు నీటి సరఫరా కోసం బ్యాలెన్స్ వర్క్‌ను రెండు నెలల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. గత ప్రభుత్వం 1422కోట్ల రూపాయలతో 1500 గ్రామాలకు మిషన్ భగీరథ పనులు చేపట్టి పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కేంద్రం నుంచి అటవీశాఖ అనుమతులు పొంది నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్-మేడ్చల్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామాల మధ్య గల మిషన్‌భగీరథ ప్లాంట్‌ను, త్రాగునీటి సరఫరా కోసం ప్రారంభించిన నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌రెడ్డిలు కలిసి ఆ ఇద్దరు సందర్శించి తాగునీటి సరఫరా కోసం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి చేయూతతో కేంద్ర ప్రభుత్వం ద్వారా అటవీ శాఖ అనుమతులు తీసుకుని 210కోట్ల రూపాయలతో 540 గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే బ్యాలెన్స్ వర్క్‌ను రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య, ఫొటోలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కె. శిరీషకృష్ణారెడ్డి

అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని మజీద్‌పూర్‌లో జరుగుతున్న మిషన్‌భగీరథ నిర్మాణ పనులను పరిశీలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యనారాయణ, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, కౌన్సిలర్ ఎస్.జశ్వంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, నాయకులు కె.కృష్ణారెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు ధన్‌రాజ్‌నాయక్, నారాయణ పలువురు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

**కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం**

**కొడంగల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వివిధ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సంభందిత అధి కారులను ఆదేశించారు. మంగళవారం కడా కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, టిడబ్ల్యుఐడిసీ, ఇరిగేషన్ శాఖల అధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, పబ్లిక్ హెల్త్, టిడబ్ల్యుఐడిసి, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులతో స్థానిక కడా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ భవనాలు, జీపీ బిల్డింగ్‌లు, అదనపు గదుల నిర్మాణ పనులు టెండర్ కోడ్ చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ఎంపీడీఓలు, మండల స్పెషల్ అధికారుల సమన్వయంతో కొడంగల్ అభివృద్ధి పనులలో పురోగతి ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంభందించి దరఖాస్తులు తీసుకోవాలని, చేయూత పెన్షన్‌లకు సంభందించి దరఖాస్తులను అన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్, భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జడ్పీసీఈఓ సుధీర్, ఆర్అండ్‌బీ సీఈ వసంత్‌నాయక్, సంభందిత అధికారులు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో మూగజీవాల కలకలం

***ఆరు నెలలుగా వరుస చోరీలతో రైతుల ఆందోళన***

***నిందితుడి ఫామ్‌లో దొరికిన మేకలు***

**ప్రధాన అనుమానితుడి కోసం పోలీసుల గాలింపు**

**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్‌నగర్ మండలంలో మేకలు, ఆవుల చోరీల వ్యవహారం కలకలం రేపుతోంది. అన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని గుండ్య నాయక్ తండాకు చెందిన హతియా నాయక్‌పై మోతీ ఘనపూర్, రాయికల్ తదితర గ్రామాలకు చెందిన రైతులు తమ మేకలు, పశువులు చోరీకి గురైనట్లు ఆరోపిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోతీఘనపూర్ గ్రామానికి చెందిన రైతు కాగుల నర్సింలు మేకలు, రాయికల్ గ్రామానికి చెందిన రైతు సండ శ్రీనివాసులు మేకలు, మోతీఘనపూర్‌కు చెందిన వంగూరి నర్సింలు ఆవు గత కొంతకాలంగా కనిపించకుండా పోయాయి. సోమవారం రాత్రి మరో ఆవును అపహరించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామస్తులు గుర్తించి వెంబడించగా, అతడు పరారయ్యాడు. అనంతరం అనుమానితుడి మేకల ఫామ్ వద్దకు వెళ్లి పరిశీలించగా, మోతీ ఘనపూర్ రైతులకు చెందిన మేకలు అక్కడ కనిపించాయి. దీంతో సోమవారం రాత్రి బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో ప్రధానంగా అనుమానిస్తున్న హతియా నాయక్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడనే అంశం చర్చనీయాంశంగా మారింది. బాధితులు సంఘటన స్థలానికి చేరుకోగానే అతను పరారైనట్లు సమాచారం. గత ఆరు నెలలుగా షాద్‌నగర్ చుట్టుపక్కల గ్రామాల్లో ఇదే తరహాలో పశువుల చోరీలు జరుగుతున్నాయా? ఇప్పటివరకు ఎవరెవరి వద్ద నుంచి మేకలు, ఆవులు అపహరించారు? చోరీ చేసిన పశువులను ఎక్కడికి తరలిస్తున్నారు? ఈ వ్యవహారంలో మరెవరైనా సహకరిస్తున్నారా? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుతున్నారు. అదేవిధంగా నిందితుడు బుల్లెట్ వాహనంపై ఆయా గ్రామాల్లో తిరుగుతూ పశువులను, మేకలను గుర్తించి అపహరిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని బాధితులు చెబుతున్నారు.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి ఆధారాలు పోలీసుల దర్యాప్తులోనే వెలుగులోకి రావాల్సి ఉంది. మేకలను గుర్తించేందుకు వెళ్లిన బాధితుడు కాగుల నర్సింలు కుమారుడు కాగుల తరుణ్ కుమార్‌పై అన్నారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ గౌడ్, సనుగోముల కృష్ణయ్య తదితరులు ఇతరులను రెచ్చగొట్టి దాడికి పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. అంతే కాకుండా మోతీఘనపూర్ నుంచి వచ్చిన గ్రామస్తులను బెదిరించినట్లు కూడా వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితుడు తరుణ్‌కుమార్ షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సైదులుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో మోతీఘనపూర్ నుంచి సుమారు 200 మంది అన్నారం గ్రామంలోని గుండ్య నాయక్ తండాకు రాత్రి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచాల్సిన అవసరం ఏర్పడింది.

ఇదిలా ఉండగా.. పశువుల చోరీల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా? చోరీ చేసిన పశువులను ఇతరులకు విక్రయిస్తున్నారా? వాటి ద్వారా వచ్చిన డబ్బును ఎవరెవరికి పంచుతున్నారనే అంశాలపై కూడా పోలీసులు దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు. బోనాల సందర్భంగా కొంతమంది పెద్దలకు డబ్బులు ముట్టజెప్పినట్లు వస్తున్న ఆరోపణలపై కూడా నిజానిజాలను పోలీసులు విచారించాల్సి ఉంది.

బాధితులు తమ మేకలను గుర్తించిన వెంటనే సంబంధిత వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రధాన అనుమానితుడిగా పేర్కొంటున్న హతియా నాయక్ ఆచూకీ, అతనికి సహకరించిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అనే అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో జరిగిన పశువుల చోరీలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించి, సమగ్ర దర్యాప్తు చేపడితే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని బాధితులు పేర్కొంటున్నారు. పశువుల భద్రతకు చర్యలు తీసుకోవడంతో పాటు, దోషులు ఎవరైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరుతున్నారు.

# అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు

**కొందరి సొంత ప్రయోజనాలకు సర్కారు రహదారి వినియోగం**

**రాకపోకలకు వీలులేకుండా పోతోంది**

**ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదు**

**చర్యలు తీసుకోకపోతే ఆందోళన**

**మోహన్‌రావు కాలనీవాసుల వార్నింగ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని మోహన్ రావు కాలనీ ఫేజ్-2లో రోడ్డును ఓ వ్యక్తి కబ్జా చేయడంతో తమకు తీవ్ర ఇబ్బందిగా ఉందని బాధిత మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలోపలికి స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు కూడ రాలేని పరిస్థితి ఏర్పడిందని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని మండిపడ్డారు. మంగళవారం బాధితమహిళలు విలేకరులకు తమ గోడును వివరించారు. కబ్జా విషయంపై కాప్రా తహసీల్దార్, జవహర్‌నగర్ సిఐ, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, కీసర ఆర్డీఓ, జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆర్ఐ వచ్చి వెళ్లిన గంటలోపే మళ్లీ రెండు టిప్పర్లు అడ్డంగా పెట్టి ఇతర వాహనాలు, స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు లోపలికి రాకుండ అడ్డుకుంటున్నారని తెలిపారు. జవహర్‌నగర్ సిఐ దగ్గరకు వెళ్లి తాము ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని చెప్పి నా.. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలంటూ ఆయన చేతు లెత్తేశారని వాపోయారు. కాప్రా తహసీల్దార్ కూడా చూ స్తాం..చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని చెప్పారు. ఇంత వరకు రోడ్డు కబ్జాను చూడలేదని ఆవేదన వ్యక్తం చేశా రు. కీసర ఆర్డీఓ, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఏ అధికారీ పట్టించుకోవటం లేదని ఆరోపించారు. గతంలో తమ రోడ్డులో అక్రమ నిర్మాణాలు చేపట్టాలని చూస్తే అడ్డుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా రహదారి వెంట రాకపోకలు లేకుండా చేస్తుంటే చూస్తూ సహించలేమన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా..స్పందించకపోవటం సబబుకాదన్నారు. రాహదారి దిబ్బంధం వలన సుమారు 45 కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆ కాలనీ బాధితులు, మహిళలు స్పష్టం చేశారు.





వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసిన పత్రాలను చూపిస్తున్న బాధిత కాలనీ మహిళలు

## 25న మహిళా సమాఖ్య మహాసభలు

**శామీర్‌పేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఈనెల 25న జరుగనున్న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జె.లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్‌పేట మినీస్టేడియం ప్రాంగణంలో మండల స్థాయి మహిళా సమాఖ్య సమావేశం పుట్ల మణెమ్మ అధ్యక్షతన జరిగింది. దీనిలో జిల్లా అధ్యక్షురాలు వి.హైమావతి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) కార్యనిర్వాహణ కార్యదర్శి పర్యవేక్షకులుగా డిజి నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జె.లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు, వేధింపులు, వివక్షతను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం అందేలా ఉద్యమాలను చేయాలని, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## పాపన్న ఆశలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**మోమిన్‌పేట్, ఆగస్టు 18. ప్రభాతవార్త:** బహుజనవిప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ బాల్‌రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను బహుజన సమాజం కోసం ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకుంటూ ఆయన ఆశలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు కే. వీరమల్లా గౌడ్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, నాయకుడు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల పోరాట యోధుడు పాపన్న



**నందిగామ, ఆగస్టు 18, ప్రభాతవార్త :** తెలంగాణలో బహుజనుల అభివృద్ధి కోసం పోరాటం కొనసాగించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము కృష్ణ, మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్ లతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు బహుజనులకు సముచిత గౌరవం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, నందిగామ సింగిల్విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, చించేటి లత శివకుమార్ గౌడ్, అగ్గి మమత సూరి, పాలమాకుల పెంటయ్య గౌడ్, చించేటి కృష్ణ గౌడ్, బి జంగయ్య గౌడ్, బాలిశెట్టి సురేష్, నందం, అగ్గి ప్రవీణ్ , పాశం బాలరాజ్ , సప్పిడి మహేష్ తదితరులు ఉన్నారు.

## పాపన్న ఆశయాలు నెరవేర్చేందుకు కృషి

**ఘట్‌కేసర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** బహుజనుల ధీరుడు సర్దార్ పాపన్నగౌడ్ అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్‌లు అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ పాపన్న చౌరస్తాలో మంగళవారం బహుజనుల ధీరుడు స్వర్గీయ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతిని నిర్వహించారు.



ఘట్‌కేసర్‌లో సర్దార్ పాపన్నగౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్ గౌడ సంఘం అధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు విచ్చేసి సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి, వజ్రేశ్‌యాదవ్‌లు పాల్గొని మాట్లాడుతూ సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఔరంగజేబును ఎదురించి గొల్కొండ కోటను స్వాధీనం చేసుకొని బహుజనుల సంక్షేమానికి కృషి చేసిన పాపన్న ఆశయాలకు అనుగుణంగా అందరూ కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బందారి శ్రీనివాస్‌గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, కాంగ్రెస్, టిడిపి, బిజెపి పార్టీల బొక్క ప్రభాకర్‌రెడ్డి, వేముల సంజీవగౌడ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వరిగంటి వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, మంకం రవి, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆర్.యాదగిరియాదవ్, మాజీ కౌన్సిలర్లు బందారి అంజనేయులుగౌడ్, బేతాల నర్సింగ్‌రావు, నాయకులు మేకల దాసు, మామిండ్ల ముత్యాలుయాదవ్, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, చింతల యాదయ్య, పల్లె మధుసూధన్‌గౌడ్, వెంకట్‌రావు, బండ్లగూడెం కిషోర్‌గౌడ్, లగ్గోని రమేశ్‌గౌడ్, బందారి జగదీశ్వర్‌గౌడ్, బీగూడెం పాండుగౌడ్, బాలక్రిష్ణారెడ్డి, మెడబోయిన సంజీవ, అబ్దుల్‌ఖయ్యూమ్, సార శ్రీనివాస్‌గౌడ్, రాగిరు మల్లేశ్‌గౌడ్, బొక్క సంజీవరెడ్డి, నంబియార్‌గౌడ్, బందారి క్రిష్ణగౌడ్, నల్లవెల్లి శేఖర్, కందకట్ల మాధవరెడ్డి, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె విజయ్‌గౌడ్, ఎం.అరుణ్‌కుమార్, రాందాసు, రాంపల్లి జగదీష్‌గౌడ్, పాముల శ్రీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్‌పాపన్నకు నివాళులు అర్పిస్తున్న మహేశ్‌గౌడ్ తదితరులు

## ఘణాపూర్‌లో సర్దార్‌పాపన్నగౌడ్ జయంతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా సర్దార్‌పాపన్నగౌడ్ నిలిచారని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కల్లుగీత సహకార సంఘం భవనంలో మంగళవారం బహుజన రాజ్యస్థాపకుడు స్వర్గీయ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు వేముల పరమేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహేశ్‌గౌడ్‌తో పాటు గౌడ సంఘం నాయకులు, సభ్యులు సర్దార్‌పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. సమ, సమాజ ప్రజాస్వామిక స్పూర్తితో పోరాడిన ధీరుడు సర్దార్ పాపన్నగౌడ్ అని ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కొనియాడారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వేముల భాస్కర్‌గౌడ్, వేముల రంగయ్యగౌడ్, వేముల మహేశ్వర్‌గౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు తాటికొండ మల్లేశ్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు వేముల రాజుగౌడ్, వేముల రమేశ్‌గౌడ్, మడ్డి సుధాకర్‌గౌడ్, వేముల సంపత్‌గౌడ్, వేముల శ్రీకాంత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ పాపన్న జయంతి వేడుకలు

**తలకొండపల్లి ,ఆగస్టు 18, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం నాడు సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ బహుజన రాజ్య నికి పునాది వేశాడని, అతని అడుగుజాడల్లో బహుజన్ల రాజ్యం సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు బాల కుమార్ గౌడ్, స్థానిక ఎస్సై శేఖర్, మాజీ సర్పంచ్ పెరుమల లలిత జోతయ్య, ఉప సర్పంచ్ కోటీశ్వర్, నాయకులు పద్మ అనిల్, లక్ష్మీ ్మనారాయణ గౌడ్, లక్ష్మీ ్మకాంత్ గౌడ్ కృష్ణ గౌడ్ స్వామి గౌడ్ తోపాటు గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# కొండారెడ్డిపల్లిలో వెలిగిన విద్యుత్ కాంతులు

-ఎమ్మెల్సీ నిధులతో హైమాక్స్ లైట్ల ఏర్పాటు

-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**కేశంపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ప్రతి నిధులతో నూతనంగా రెండు హైమాక్స్ లైట్లు విజయవంతంగా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ప్రధాన కూడలిలో చీకట్లు తొలగి ప్రజలు,వాహనదారుల రాకపోకలకు ఎంతో సౌకర్యవంతంగా వీలు కలుగుతుందని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.తన సొంత నిధులతో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్లు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.హైమాస్ట్ లైట్ల ప్రారంభం అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధి,ప్రజల ప్రాథమిక అవసరాల తీర్చేందుకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు కావడంతో చీకటి సమస్యలు తొలగిపోతాయని, రాత్రి వేళల్లో ప్రజలకు ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు రక్షణగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామంలో వెలుతురు నింపేందుకు సొంత నిధులను వెచ్చించి రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినందుకు కొండారెడ్డి పల్లి గ్రామ ప్రజలు,స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,లింగం దాన సర్పంచ్ నాగిల్ల వెంకటేష్,సుందరపూర్ సర్పంచ్ భారతి రవీందర్ నాయక్, భైర్కాన్



హైమాక్స్ లైట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

పల్లి శివ యాదవ్,మాజీ సర్పంచులు,శేఖర్ పంతులు,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,ప్రభాకర్ రెడ్డి,క్రిష్ణయ్య, బి ఆర్ ఎస్ నాయకులు కోటేశ్వర్,యాదయ్య,రాంచందర్ నాయక్ ,ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,సహదేవ్,నరేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచులు సుదర్శన్ గుప్త,రామ్ రెడ్డి,మన్మధ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు నాగరాజు,పల్లాటి క్రిష్ణయ్య,బద్రు నాయుక్,సత్య నారాయణ, కేశంపేట మురళి,అశోక్, జగన్ రెడ్డి,క్రిష్ణ, మల్లేష్, అమరేందర్,ఆంజనేయులు,నరేందర్ లక్ష్ ్మణ్,సాయిరాం,వేములనర్వ మల్లేష్,శ్రీను,శేఖర్,రమేష్, సూరమని శంకర్,అభి శ్రీనివాస్,కిషోర్, శ్రీనయ్య,శశి, మాణిగౌడ్,రతన్ నాయక్,కొండారెడ్డి పల్లి గ్రామస్తులు, మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులను అద్దెలకు వినియోగించొద్దు



ప్రైవేటు పాఠశాల యజమానికి వినతిపత్రం అందజేస్తున్న టిటిబిఎ ప్రతినిధులు

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలల బస్సులను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అద్దెలకు వినియోగించ వద్దని ఆమనగల్లు టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు అసోషియేషన్ ప్రతినిధులు కోరారు. మంగళవారం అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆమన గల్లు పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలను సందర్శించి వినతిపత్రం అందజేశారు. రోడ్డు రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులను అద్దెలకు ఇస్తుండడంతో ప్రైవేటు వాహనాలపై ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థుల రవాణా కోసం వినియోగించాల్సిన పాఠశాల బస్సులను ఇతరత్ర కార్యక్రమాలకు అద్దెలకు ఇవ్వడంలాంటివి నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో కల్వకుర్తి తాలూకా ఇన్‌చార్జ్ ఎడ్ల శ్రీశైలం, వద్యావత్ పాండు, ఇస్లావత్ రమేష్, నేనావత్ హనుమంతు, కొమ్ముగోని శీను, దేరంగుల మహేష్, ధర్మేందర్, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## రాంపల్లిలో ఎంఎంసి కమీషనర్ తనిఖీ

**కీసర,ఆగస్టు18,ప్రభాతవార్త:**

మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి ప్రాంతంలో పర్యటించి వివిధ పారిశుధ్య,అభివృద్ధి నిర్వహణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమీషనర్ ఎస్ఏటి వాహనాల పనితీరు,ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ అప్‌డేషన్ వివరాలను సమీక్షించారు.రాంపల్లి ప్రాంతంలోని ప్రధాన రహదారులు,అంతర్గత రహదారుల్లో చేపడుతున్న రోడ్ వైడెనింగ్ పనులు, గుంతలు, ప్యాచ్‌వర్క్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించారు.సిఅండ్‌డి వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ ముఖ్యంగా ఖాళీ స్థలాలు,ఓపెన్ స్పేస్‌లలో వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మొక్కలు లేకుండా ఖాళీగా ఉన్న ప్లాంటర్ బాక్సులను గుర్తించి వాటిని తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు.ప్లాంటర్ బాక్సుల్లో మొక్కల ఏర్పాటు నిర్వహణ పనులు నాణ్యతతో నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు.రాంపల్లి



రాంపల్లిలో ఎంఎం కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి తనిఖీ చేస్తున్న దృశ్యం

ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ,రహదారుల అభివృద్ధి,పచ్చదనం పెంపునకు సంబందించి చేపడుతున్న పనులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డి,అధికారి రాంరెడ్డి,అన్ని విభాగాల సెక్షన్ హెడ్‌లు తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

## బలహీన వర్గాల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి

**రంగారెడ్డిఅర్బన్,ఆగస్టు18,ప్రభాతవార్త:** సామాజిక సమానత్వం,బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి అన్నారు.ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యంగా పోరాడారని తెలిపారు. అన్యాయం,దోపిడీ,అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.సమాజంలోని బడుగు,బలహీన వర్గాలకు సమాన అవకాశాలు,హక్కులు లభించేలా కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.పాపన్న గౌడ్ జీవితం,ఆశయాలు యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్న అదనపు కలెక్టర్ ఆయనలోని ధైర్యం,సామాజిక స్పృహ,సమానత్వ భావనలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేషురామ్,తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్,టీపీసీసీ కార్యదర్శి శివకుమార్,కాంగ్రెస్ నాయకులు మంగమ్మ,రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య,ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు,కార్యదర్శి రవి గౌడ్, కసర మోని కృష్ణ యాదవ్,శ్యామ శంకర్,ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ సుధాకర్ గౌడ్, శ్రీశైలం గౌడ్,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

## నేటి యువతకు ఆదర్శప్రాయుడు సర్వాయి పాపన్న గౌడ్

**కేశంపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలో బహుజన వీరుడు, విప్లవకారుడు సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను కేశంపేట మండల గౌడ సంఘం నాయకులు మరియు స్థానిక ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి కొబ్బరికాయలు కొట్టి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రముఖ గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సమాజంలో అణచివేతకు గురైన వర్గాల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడు అని కొనియాడారు. ఆయన పోరాట పటిమ, ధైర్యం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో గౌడ సంఘం ప్రముఖ నాయకులు రమణ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, ప్రకాష్ గౌడ్, రమేష్ గౌడ్, పాండుగౌడ్, తిరుపతి గౌడ్, శివ గౌడ్, పాండు గౌడ్, మహేష్ గౌడ్, రవి గౌడ్, గ్రామ ప్రముఖులు శ్రీకాంత్ రెడ్డి, శివాజీ, యుగంధర్, జంగయ్య, శేఖర్ రెడ్డి, హరికిషన్ రెడ్డి, యాదయ్య, హబీబ్ అంజయ్య, జలాల లక్ష్ ్మయ్య, ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆమనగల్లులో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తల్లోజు ఆచారి, చుక్కా అల్లాజీగౌడ్

## సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో మంగళవారం స్థానిక గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాటమయ్య గుట్టపై ఉన్న పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా జాతీయ ఒబిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్య నాయక్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, మొక్తాల వెంకట య్య, ఎర్రవోలు మహేశ్‌తోపాటు గౌడ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు, ఆమనగల్లు మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ చుక్కా అల్లాజీగౌడ్‌లు హాజరైనారు. ఈసందర్భంగా పట్టణంలో సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈమేరకు ముఖ్య అతిథులు మాట్లాడుతూ పాపన్నగౌడ్ కేవలం గౌడ కులానికే కాదు, తెలంగాణ ప్రజలందరికీ స్వేచ్ఛా స్ఫూర్తిని ఇచ్చిన మహనీయుడని, ఆయన త్యాగాలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందని ఆచారి, పత్యానాయక్, పాపిశెట్టి రాము అన్నారు. పాపన్నగౌడ్ ధైర్యసాహసాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు గంగరవి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, పాపన్నగౌడ్ యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, గుండ్రాతి నరేష్ గౌడ్, నిరంజన్, నరసింహ, బాలకృష్ణగౌడ్, అల్లాజీగౌడ్, సతీష్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నగర్‌లో దుమ్మురేపిన పాపన్నగౌడ్ జయంతి వేడుకలు!

**జవహర్ నగర్, ఆగస్టు18,ప్రభాత వార్త:** మేడ్చల్ మాల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్‌లో ఉన్న అంబెద్కర్ నగర్‌లో వీరుడు,ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 376వ జయంతివేడుకలు ఘనంగా,ఉత్సాహభరితంగా నిర్వహించారు .అంబెద్కర్ నగర్, బీజేఆర్ నగర్ గౌడ సంఘం,ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమనికి గౌడ సంఘం,సభ్యులు,పెద్దలు,యువకులు,వివిధ రాజకీయపార్టీల నాయకులు, వివిధ కులస్తులు.భారీగా తరలివచ్చారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి..నేటీతరానికి ఆదర్శం అంటూ నినాదాలు చేశారు.ఆయాన ధైర్యం,తెగువ,పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.పాపన్నగౌడ్ ఆశయాలు చిరస్మరణీయం..ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం అని అన్నారు.అంబెద్కర్ నగర్‌లో పండుగా వాతావరణంలో జరిగిన జయంతి వేడుకలు యువతలో ఉత్సాహన్ని నింపాయి.



## ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

**శామీర్‌పేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ జాము రవి, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మదుకర్‌రెడ్డి, బిఆర్ఎస్



మూడుచింతలపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు, తదితరుల దృశ్యం

అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దీనిలో పలువురు నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహాయోధుడు అని అన్నారు. ఆయన ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్, నాయకులు వెంకటనర్సింహ్మారెడ్డి, దత్తుగౌడ్, భూమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బలరాంగౌడ్, బాలేశ్, నర్సింహ్మ, అనిల్‌రెడ్డి, రవి, చిత్తయ్య, మాజీ ఎంపిటిసి నాగరాజు, సాయి శ్రీనివాస్, వెంకటేశ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### శామీర్‌పేటలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద

శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. బహుజన విప్లవ వీరుడు, మొగులలను ఎదిరించి గోల్కొండ కోటపై మొదట గా జెండా ఎగురవేసి బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప వీరుడు అని కొనియాడారు. యువత సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయసాదనకు కృషి చేయాలని సూచించారు.



## అన్యాయానికి ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి పాపన్న

..మండల గౌడ సంఘం అధ్యక్షులు వరప్రసాద్‌గౌడ్

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** అన్యాయానికి ఎదురొడ్డి నిలిచిన ధైర్యవంతుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మండల గౌడ సంఘం అధ్యక్షులు వరప్రసాద్‌గౌడ్ అన్నారు. మండల గౌడ సంఘం అధ్యక్షులు వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వరప్రసాద్‌గౌడ్, తహ సిల్దార్ వెంకటేష్ ప్రసాద్, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్,గాజిపూర్ మాజీ సర్పంచ్ ఆనందలక్ష్మి మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ అన్యాయా నికి, అణచివేతకు, వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరుడని అన్నారు.సామాన్య ప్రజలకు అండగా నిలిచి, అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన గొప్ప నాయకుడని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో వెనుకడుగు వేయకుండా పోరాడిన పాపన్న సాహసం ప్రస్తావించడం ఎంతైన అవసరం ఉందని అన్నారు. పాపన్న గౌడ్ ధైర్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను మరింత విస్తృతంగా అధ్యయనం చేసి, భావితరాలకు అందించాల్సిన భాధ్యత ప్రభుత్వంపై. సమాజంపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారాయన్‌గౌడ్, మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, నాయకులు జితేందర్‌రెడ్డి, మాజీ యంపిటిసి విద్యాసాగర్, గౌడ సంఘం సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సాయిలుగౌడ్, రమేష్‌గౌడ్, కందనెల్లి నారాయన్‌గౌడ్, గోపాల్‌పూర్ బాల్‌రాజ్‌గౌడ్, నర్సిములు గౌడ్, నరేష్‌గౌడ్, మోహన్‌గౌడ్, మహేందర్‌గౌడ్, అంబుగౌడ్, సంజయ్యగౌడ్,హరీష్‌గౌడ్, అశోక్‌గౌడ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యస్థాపనకు కృషి చేసిన వీరుడు పాపన్న



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు పాల్గొన్న నేతలు

**కుల్కచర్ల,ఆగస్టు 18, ప్రభాతవార్త:** అణగారిన వర్గాల మధ్య నుంచి ఎదిగి, వారినే తన పోరాటశక్తిగా మలుచుకుని తెలంగాణ నేలపై స్వీయ పాలనకు పునాది వేసిన అసాధారణప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సర్పంచ్ వార్వల ఆంజిలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గౌడ సంఘం మండల అధ్యక్షులు మాలే కృష్ణయ్య గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల నాయకులు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..అణచివేతకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాడి, బహుజన రాజ్యస్థాపనకు ఎంతో కృషి చేసిన వీరుడని కొనియాడారు.ఆయన చూపిన పోరాట పటిమ, ఆశయాలు, నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పాపన్న గౌడ్‌లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు అయా సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న తహసీల్దార్ భూపాల్‌కు సన్మానం

**మేడ్చల్, ఆగస్టు 18. ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, అదే విధంగా ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా అవార్డు అందుకున్న నరేష్‌లను బీజేపీ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్ ఘనంగా సన్మానించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ఆమనగల్లు, ఆగస్టు18, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన కడ్తాల వార్త రిపోర్టర్ తిరుపతయ్యగౌడ్ తండ్రి వల్లభదాసు పెంటయ్యగౌడ్ మంగళవారం కన్నుమూసాడు. బాధిత కుటుంబాన్ని రాజకీయ ఇతర రంగాల ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. గ్రామ సర్పంచు న్యాలపట్ల నరేందర్‌రెడ్డి, ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్ పాపిశెట్టి రాముతోపాటు ఇతరులు పెంటయ్య పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తిరుపతయ్య తోపాటు అతని కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూసలి భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల అమరేందర్ అనే వ్యక్తికి మంగళవారం నాడు ఉప్పల ట్రస్ట్ నుంచి సిమెంటును పంపిణీ చేశారు. నిరుపేదవాడైన అమరేందర్ ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో పుల్ల ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటు పంపిణీ చేసినట్లు మాజీ సర్పంచ్ పెరుమల లలిత జోతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమల లలిత జోతయ్య, ఉప సర్పంచ్ కోటీశ్వర్ నాయకులు మల్లేశ్వరి జంగయ్య రవికుమార్ దశరథం శ్రీను రమేష్ తదితరులున్నారు.

## బాలిక సాయి ప్రియ అదృశ్యం

**జవహర్ నగర్,ఆగస్టు18,ప్రభాత వార్త:** జవహర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో వేములఅనుష కుమార్తె వేముల సాయి ప్రియ అలియాస్ గంగ (14) అదృశ్యమైనట్లు జవహర్ నగర్ పోలిస్‌స్టెషన్ ఫిర్యాదు నమోదైంది.మానసిక వైకల్యంతోపాటు మాట్లాడటం ఇబ్బంది పడుతున్న సాయిప్రియను ఈనెల17న ఉదయం ఇంట్లో ఉంచి తల్లి పనికి వెళ్లింది.సాయంత్రం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి కుమార్తె కనిపించలేదు. బంధువులు,తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాలిక ఆచూకీ తెలిసిన వారు 8712662097,8712662103,8712662188 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన

**దుద్యాల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిల్ముల్‌మైల్వార్ గ్రామంలోని పీఎం శ్రీ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ వ్యవసాయ అధికారులు విజయరత్న, క్లారెన్స్ పాల్గొని మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రాధాన్యం, నేలలోని పోషకాల స్థాయిల గుర్తింపు, పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై విద్యార్థులకు వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడితే పంట దిగుబడులు పెరగడంతో పాటు ఎరువుల వినియోగాన్ని సమతుల్యం చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని, సిఫారసుల మేరకు ఎరువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, ఏవో తులసి, ఏఈవో బాబు, హెచ్‌ఎం యాదయ్య, ఉపాధ్యాయులు గోవర్ధన్, విజయుడు, అనిల్, హనుమంతు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంసాన్‌పల్లిలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

**దుద్యాల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండలంలోని అంసాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని బుధవారం ఉదయం 9.30 గంటలకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతన్న ప్రారంభించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అవుటి శేఖర్ తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

## సంక్షేమ పథకాలను రద్దుచేస్తే ఉద్యమం

**దుద్యాల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** పేదలు, రైతులకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను కొనసాగించాలని దుద్యాల్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పథకాలను రద్దు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ తహసిల్దార్ కిషన్ కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచన మేరకు ఈ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. పథకాలను యథావిధిగా కొనసాగించడంతో పాటు చట్టబద్ధత కల్పించాలని కోరారు. పథకాల రద్దుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఖానాపూర్ గ్రామస్తులు

**తలకొండపలి, ఆగస్టు 18,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఈనెల 23న ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉన్నందున హాజరుకావాలని కోరుతూ మంగళవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి ఆహ్వాన పత్రం అందించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్వగ్రామం తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామం కావడంతో తప్పనిసరి హాజరుకావాలని, నూతనంగా ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే కు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీను, జంగయ్య తదితరులు ఉన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలను అనుసంధానం చేయొద్దు



**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఎంఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు ఆకాశ్ నాయక్ షాద్‌నగర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 97 ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసే నిర్ణయం తీసుకోవడం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను తక్కువ ఖర్చుతో అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను ఈ విధానం ద్వారా నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నియామకం, ల్యాబ్‌ల ఆధునీకరణ, హాస్టల్ సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. అయితే దీనికి బదులుగా పీపీపీ విధానాన్ని తీసుకురావడం వల్ల విద్యా రంగం ప్రైవేటీకరణకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను పటిష్టం చేయడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సాంకేతిక విద్యా వ్యవస్థను కాపాడేందుకు జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆకాశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యేను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# ఎరువుల విక్రయాలు పారదర్శకంగా ఉండాలి

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రైతులకు ఎరువుల లభ్యతలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, ఎరువుల విక్రయాలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరిగేలా చూడాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ( ఏడిఏ) అరుణ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్సు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్ దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ వివరాలు, ధరల పట్టికలు, నేమ్ బోర్డులు ఇతర సంబందిత రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ అరుణ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమలస్వామి, మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్సు అధికారులు

## శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంలో
# విగ్రహ ప్రతిష్ట,అమ్మవారి కల్యాణోత్సవం



లాల్‌గడిమలక్‌పేట్‌లో శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:** లాల్‌గడిమలక్‌పేట్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట, అమ్మ వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించి అమ్మ వారి విగ్రహప్రతిష్ట పూజలు నిర్వహించారు. ఆ తరువాత అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట, అమ్మవారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి విచ్చేసి శ్రీరేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట, కల్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనతో పాటు శామీర్‌పేట మండల మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, పలువురు కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, ఎస్.మోహన్‌రెడ్డి, బి.రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి,గ్రామ భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా భవనాల నిర్మాణంలో వేగం పెంచాలి

**దుద్యాల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో కొనసాగుతున్న వివిధ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి నిర్మాణ సైట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, వెటర్నరీ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అదనపు కార్మికులను నియమించి ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు సాగాలని సూచించారు. విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం దుద్యాల్ మండల ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల సముదాయ నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్



చౌదరిగూడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్

## కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు పనిచేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** పార్టీలో సీనియర్ నాయకులకు పదవులు పంచుతామని పార్టీ బలోపేతం కొరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ అధ్యక్షతన మంగళవారం చౌదరిగూడలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమపథకాలు కొనసాగిస్తుందని వాటిని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీబలోపేతం కొరకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రజల కొరకు ఏమి చేస్తుందో చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ ఎం. శరత్‌చంద్రారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ కాంగ్రెస్ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పులికంటి బాస్కర్‌రెడ్డి, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ పి. అమరేందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు పసులాది నర్సింగ్ రావు ముదిరాజ్, భోజిరెడ్డి, మాజీ కాంగ్రెస్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏర్ర మాధవి, నాయకులు ఏర్ర రాజు, కె. వినోద్, యుగంధర్‌రెడ్డి, బండ్లగూడ వాణి, దేశం అంజన్‌కుమార్ గౌడ్, పి. ప్రభాకర్ గౌడ్, పి. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే అనురాగ్ యూనివర్శిటీ లక్ష్యమని చైర్మన్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో రెండు రోజుల పాటు ఓరియేంటేషన్ కార్యక్రమం జరిగింది. దాదాపు 2500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ చైర్మన్, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ అనురాగ్ యూనివర్శిటీ చరిత్ర, అభివృద్ధి పరిణామ క్రమాన్ని వివరించారు. సంస్థ ప్రయానం గురించి విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనివర్శిటీ అసోసియేట్ ఉపాధ్యక్షుడు అనురాగ్ పల్లా, యూనివర్శిటీ సీఈవో. ఎస్. నీలిమ, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి, యూనివర్శిటీ డైరెక్టర్ మహీపతి శ్రీనివాస రావు, ప్రొఫెసర్లు బి. దేశాయ్, గోపాల్‌రెడ్డి,కె. సుధీర్‌రెడ్డి, ఎం. ముత్తారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్శిటీలో జరిగిన ఓరియేంటేషన్ డే కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూనివర్శిటీ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి.

## విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో ఉండాలి

**దోమ,ఆగస్టు 18, ప్రభాతవార్త:** పాఠశాలలో చదివే విద్యార్థులందరు క్రమశిక్షణతో ఉండాలని దోమ మండల విద్యాదికారి వెంకట్ అన్నారు.మంగళవారం నాడు దోమ మండల పరిదిలోని దిర్సంపల్లిగ్రామములో ప్రభుత్వ పాఠశాలలో అంకిత స్వచ్చంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్‌ఆద్వర్యములో విద్యార్థులకు బ్యాగ్లు,చెప్పులు,మ్యాట్‌లు అందజేశారు. ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుండే క్రమశిక్షణ, పట్టుదల,కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చదు వుతోపాటు నడవడిక,సామాజిక బాధ్యత ను పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా సామాగ్రిని అందించిన అంకిత స్వచ్చందసంస్థ సిబ్బందిని అబినందించారు. దోమ మండలములోప్రీ ప్రైమరీ పాఠశాలలు ఐదు మంజురు అయినట్లు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకూడ పెరిగినట్లు తెలిపారు.విద్యార్థుల తల్లితండ్రులు తమ బాలబాలికలను పాఠశాలకు సక్రమంగా వచ్చేవిదంగా కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమములో దిర్సంపల్లి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి,జీఎచ్‌ఎం రూప్‌సింగ్,ప్రదానోపాద్యాయులు కేశవులు, ఉపసర్పంచ్ తిరుపతయ్య,రాములుగౌడ్, హైమద్‌పటేల్, అఖిల్, ఉపాద్యాయులు పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దాము

## అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

**కొడంగల్,ఆగస్టు 18,ప్రభాతవార్త:**

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము కోరారు.ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కొడంగల్‌లో రాజకీయ పరిస్థితులు,పార్టీ బలోపేతంపై సీఎం తమకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడానికి రూ.3కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరడం జరిగిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు దాము తెలిపారు.సీఎంను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు దస్తప్ప,రమేష్,సాయిలు,అశోక్,లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

**షాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తిమ్మారెడ్డిగూడ గ్రామానికి చెందిన మద్దూరి మోనిక (29) అనే వివాహిత మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.మోనికకు సుమారు మూడు సంవత్సరాల క్రితం రాజశేఖర్‌తో వివాహం జరిగిందని, వీరికి 15 నెలల వయస్సు గల కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా మోనిక అనారోగ్యంతో పాటు మానసికంగా కూడా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్ర సమయంలో మోనిక బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా, ఆమె కిటికీకి చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే చున్నీని విప్పి చూడగా, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.మోనిక అనారోగ్యం మరియు మానసిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఆమె తండ్రి చిట్ల సైలూ తెలిపారు. తన కుమార్తె మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

**షాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :**

చెరువులో దూకి మహిళా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాబాద్ మండలంలో మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన చాకలి సత్తమ్మ (70) కుటుంబ కలహాల కారణంగా గతంలో తన కుమార్తె ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో మానసికంగా బాధపడుతూ ఉండేది.

ఈ నేపథ్యంలో తరచూ ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులతో చెప్పేది. 17న రాత్రి మంగలోని గుట్ట చెరువులో దూకేందుకు వెళ్లగా గ్రామస్థులు గమనించి ఇంటికి తీసుకువచ్చారు. 18న తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయిన సత్తమ్మ, అదే చెరువులో మృతదేహంగా కనిపించింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సత్తమ్మదిగా గుర్తించారు. జీవితంపై విరక్తితో ఆమె చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు, ఈ ఘటనపై ఎవరికీ అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయకుండా

## ఇతర పనులు ప్రారంభించడం విడ్డూరం..

**యాచారం ఆగస్టు18, ప్రభాతవార్త:**

మంతన్ గౌరెల్లి గ్రామంలో అత్యవసరాలకు అయిన పనులు ప్రారంభానికి శంకుస్థాపనలకు దూరంగా ఉండి అదనపు పనులకు ప్రారంభం కావడం విడ్డూరం అని మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు విచ్చేసిన ఎమ్మెల్యేలు పనులను ప్రారంభించారు.

అందుకు మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ స్పందిస్తూ నల్లవెల్లి మంతన్ గౌరెల్లి మధ్యలో ఉన్న రోడ్డు పనులకు నిధులు మంజూరైన పనులు ప్రారంభం కపోవడం జరిగిందని గుర్తు చేశారు. అత్యవసరాలు విస్మరించి తాత్కాలిక ఉపశమనం కోసం పనులు చేశారన్నారు.



మంబాపూర్ గ్రామకమిటి నియామక పత్రాలను అందజేస్తున్న అధ్యక్షులు

## విభేదాలను పక్కన పెట్టి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయాలి

.. మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** వ్యక్తిగత విభేధాలను పక్కన పెట్టి పార్టీ ప్రయోజనాల కోసం పని చేయాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని పెద్దేముల్, మారెపల్లి, మంబాపూర్ గ్రామాలలో గ్రామకమిటీల అధ్యక్ష, కార్యదర్శులను నియమించారు. మంబాపూర్ గ్రామకమిటీ అధ్యక్షులుగా హన్మగల్ల యాదప్ప, ఉపాధ్యాక్షులుగా గొబ్బురు రాములు, ఎంగురు ఎల్లప్పలు నియామకం అయ్యారు. ఈ సందర్బంగా పి.మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాయకుల కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకు కృషిచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో బూత్‌స్థాయి కమీటిలు చురుకుగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందుతున్నాయా లేదా చూసి వారికి అందేలా చూడాలని సూచించారు. పదవుల కోసం కాకుండా ప్రజాసేవ చేసేందుకు కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయన్‌గౌడ్, కోటపల్లి మార్కెట్ కమిటి అధ్యక్షులు అంజయ్య, వైస్‌చైర్మెన్ ఎస్.నారాయ న్‌రెడ్డి,అనంతయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



తమ్మంలోని గూడలోనీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ,సర్పంచ్ నాయకులు

**యాచారం,ఆగస్టు18, ప్రభాతవార్త:**

పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి, కేస్లీ తండా, నల్లవెల్లి, తమ్మలోని గూడ, చౌదర్పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో రాధారాణి,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్లు,వార్డు సభ్యులు, గ్రామస్థులతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మంతన్ గౌరెల్లి గ్రామంలో 30 లక్షల సీసీ రోడ్ల శంకుస్థాపన,20 లక్షల అండర్ డ్రైనేజీ పనులు,20 లక్షల తో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, కేస్లి తండాలో 20 లక్షల గ్రామపంచాయతీ భవనం, ఐదు లక్షల సిసి రోడ్డు,5 లక్షల అండర్ డ్రైనేజీ, నల్లవెల్లి లో 40 లక్షల సిసి రోడ్డు, 20 లక్షల అండర్ డ్రైనేజ్, తమలోని గుడలో 20 లక్షల సిసి రోడ్డు, 20 లక్షల అండర్ డ్రైనేజీ, కోటి 15 లక్షల సిసి రోడ్డు, 25 లక్షలు అండర్ డ్రైనేజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, దెంది రాంరెడ్డి, కిషన్ నాయక్, అరవింద నాయక్, కృష్ణ, వివిధ గ్రామాల పార్టీల నాయకులు మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మధుకర్ నాయక్, రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటె శ్రీశైలం, జయప్రకాష్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను సిపిఐ వ్యతిరేకిస్తుంది

**శంషాబాద్, ఆగస్టు18,ప్రభాతవార్త :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల గంగయ్య అన్నారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర నేడు శంషాబాద్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ కూడలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు .రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక సామాజిక పరంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారుకేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.దేశంలోని నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని సత్యం విమర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 21నఅబ్బుల్లాపూర్‌మెట్ భూపోరాట కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, పేదల హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి, కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు ,నర్సగిరి, తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ చౌరస్తా అంబేద్కర్ కూడలిలో....**

సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర రాజేంద్రనగర్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం రాజేంద్రనగర్ చౌరస్తా అంబేద్కర్ కూడలిలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం ప్రభు లింగం ,ఎం ఏ రియాజ్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ , కైలాసమ్మ, జిల్లాని గంగారం ప్రభాకర్ ,తదితరులు పాల్గొన్నారు.



ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## రైతులకు సాగు పద్ధతులపై శిక్షణ

**మేడ్చల్, ఆగస్టు 18. ప్రభాతవార్త :** రైతులు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) ఆధ్వర్యంలో మేడ్చల్ మండలంలోని ఘనాపూర్ గ్రామంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రయర్ లెర్నింగ్ (ఆర్‌పీఎల్) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పలుకీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలనిచ్చే నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక విధానంతో పాటు పంటలకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, కూరగాయల సాగులో నూతన సాంకేతిక పద్ధతులను వివరించారు.

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం దృష్ట్యా కూరగాయల సాగు చేపట్టాలని, ఆరుతడి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.ఉద్యానవన శాఖ ద్వారా అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏడీఏ ఎన్. వెంకట్ రాంరెడ్డి, మేడ్చల్ ఎంఏఓ ఎస్. మాధవరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సునావత్ పార్వతి, రాజేంద్రనగర్ ఎఫ్‌టీసీ ఏవో కృష్ణవేణి, హెచ్ఓ వెంకటరమణ, వ్యవసాయ విస్తరణ అధికారులు తేజస్విని, సాగరిక, కోరమండల్ కంపెనీ డీలర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## భారత జాతీయ మహిళా సమాఖ్య మహాసభలను విజయవంతం చేయాలి


శామీర్‌పేటలోని మినీస్టేడియంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జె.లక్ష్మి,పాల్గొన్న మహిళా నాయకురాళ్ళ దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఈ నెల 25వ తేదీన జరుగనున్న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జె.లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్‌పేట మినీస్టేడియం ప్రాంగణంలో మండల స్థాయి మహిళా సమాఖ్య సమావేశం పుట్ల మణెమ్మ అధ్యక్షతన జరిగింది. దీనిలో జిల్లా అధ్యక్షురాలు వి.హైమావతి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) కార్యనిర్వాహణ కార్యదర్శి పర్యవేక్షకులుగా డిజి నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జె.లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలు, వేధింపులు, వివక్షతను అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విద్య,ఉపాధి, ఆరోగ్యం, భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం అందేలా ఉద్యమాలను చేయాలని, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా,సాధికారత, ఆర్థిక స్వాలంభన కోసం స్వయం సహాయక సంఘాలకు రుణాలు, మార్కెట్ సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని అన్నారు. ఆ తరువాత భారత జాతీయ మహిళా సమాఖ్య శామీర్‌పేట మండల గౌరవ అధ్యక్షురాలుగ డిజి నాగరాణి, అధ్యక్షురాలుగ పుట్ల మణెమ్మ, సహాయ కార్యదర్శిగా సలేంద్ర నాగరాణి, సుదగాని మమత, మండల కార్యదర్శి కొట్నాల నిర్మల, కోశాదికారిగ గాయత్రి, దూలకంటి లావణ్య, నాగరాణి, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై ఎస్ఓటి పోలీసుల దాడులు

**నందిగామ, ఆగస్టు 18, ప్రభాతవార్త :** నందిగామ మండలం మజీద్ మామిడిపల్లిలోని మురళి గౌడ్ ఇంట్లో ఏడు మంది పేకాట ఆడుతూ ఎస్ఓటి పోలీసులకు చిక్కారు. ఇందులో మురళి గౌడ్ , నరసింహులు, సహదేవ్ , నవీన్ , అజీమ్ గోపాల్ , రంగయ్య లు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు పోలీసుల ద్వార తెలిసింది . వీరందరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుండి రూ.21,450 రూపాయలతో పాటు ఏడు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి నందిగామ పోలీస్ స్టేషన్ కి తరలించినట్లు తెలిపారు.

## షాద్‌నగర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్, ఫీచర్ సిటీ ఆధ్వర్యంలో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. భారతదేశంలో ఏటా సుమారు 1.50 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, తెలంగాణలో కూడా వేలాది మంది మృత్యువాత పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాహనం నడిపేటప్పుడు పూర్తి దృష్టి రోడ్డుపైనే ఉండాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదాలకు రహదారుల లోపాలు, గుంతలు, అతివేగం, సిగ్నల్ ఉల్లంఘనలు వంటి కారణాలు ఉన్నప్పటికీ, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల నియంత్రణ కోల్పోయి ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు.డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని ఏసీపీ చంద్రశేఖర్ సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. సీఐ బి. శంకరయ్య ఎస్సై వెంకటేష్, ఏఎస్ఐ ఆర్. రవీందర్, సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఉద్యమకారుల సమగ్ర జాబితా

**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారుల కార్యాలయంలో మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో షాద్‌నగర్ ప్రాంతం నుంచి పాల్గొన్న ఉద్యమకారుల సమగ్ర జాబితాను రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. వెంకట్ రాంరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో షాద్‌నగర్ ప్రాంతం నుంచి


మాట్లాడుతున్న వదినకారుల సంఘం నాయకులు

పాల్గొన్న ఉద్యమకారుల వివరాలను సేకరించి, వారి పేర్లు, ఉద్యమంలో పాల్గొన్న సందర్భాలు, సేవలు, ఇతర వివరాలతో కూడిన సమగ్ర జాబితాను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలు, సేవలను గుర్తించి, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారులందరూ తమ వివరాలను అందించి సహకరించాలని సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి. లక్ష్మి  మ్మ నరసింహ్మా రెడ్డి, పాల్గొన్నారు.

# రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్**

**మేడ్చల్, గౌడవెల్లి, గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్లు, ఆర్‌యూబీలను పరిశీలన**

**మేడ్చల్, ఆగస్టు 18. ప్రభాతవార్త :** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పెండింగ్‌లో ఉన్న రైల్వే స్టేషన్లు, ఆర్‌యూబీ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు.

మంగళవారం మేడ్చల్, గౌడవెల్లి, గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్లతో పాటు ఆయా ప్రాంతాల్లోని రైల్వే అండర్ బ్రిడ్జిలను ఎంపి పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో కలిసి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణాలను తెలుసుకుని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మేడ్చల్ ప్రాంతంలో కూడా రైల్వే మౌలిక వసతులు మరింత మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మేడ్చల్, గౌడవెల్లి, గుండ్లపోచంపల్లి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే రవాణా వ్యవస్థ కూడా అందుకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఈటల రాజేందర్ తెలిపారు.

రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలపై స్థానిక నాయకులు ఎంపీ


మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న

దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కూడా ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ ఇన్‌చార్జి పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్లపల్లి మురళీ గుప్త, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి విష్ణు గౌడ్, నాయకులు థాత్రిక లక్ష్మణ్ వంజరి, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, రాఘవ రెడ్డి, గోపు నాగరాజు, వంశీధర్ రెడ్డి, హరిబాబు రెడ్డి, నర్సింగ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మహీందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు

**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి తన మాతృమూర్తి కీ.శే. వంకాయల తిరుమలమ్మ జ్ఞాపకార్థం షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు వంకాయల నారాయణరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తమ తల్లిదండ్రులకు, గురువులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అంజయ్య యాదవ్ ఆకాంక్షి  ంచారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని




అన్నారు. తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వంకాయల నారాయణరెడ్డి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తిరుపతమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో రైళ్లకు హాల్ట్ కల్పించాలి


మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజా హరినాథ్

**మేడ్చల్, ఆగస్టు 18, ప్రభాతవార్త :**

మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు, రైల్వే అధికారులకు మెమోరాండం సమర్పించారు.

ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ.. మేడ్చల్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు రైళ్లలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. మేడ్చల్ స్టేషన్‌లో ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు సికింద్రాబాద్, కాచిగూడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. మేడ్చల్‌లో మరిన్ని రైళ్లను నిలిపితే వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు మరింత ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అందుకు స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మేడ్చల్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందన్నారు. మేడ్చల్ మీదుగా పలు రైళ్ల రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, అన్ని ముఖ్యమైన రైళ్లకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించేందుకు రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ ఇన్‌చార్జి పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్లపల్లి మురళీ గుప్త, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమదాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శి విష్ణు గౌడ్, సీనియర్ నాయకులు థాత్రిక లక్ష్మణ్ వంజరి, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు రాఘవ రెడ్డి, గోపు నాగరాజు, వంశీ రెడ్డి, పోతుల హరిబాబు రెడ్డి, మామిళ్ల నర్సింగ్, మహేష్ గౌలికర్, పురుషోత్తం, మహీందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ భక్తి భావాలు కలిగి ఉండాలి

**కొడంగల్,ఆగష్టు 18,ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ భక్తి భావన కలిగి ఉండాలని జాకన్‌పల్లి మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ షటస్థల బ్రహ్మ గవిసిద్ద లింగ మహాస్వామి అన్నారు.శ్రావణమాసం సంచార ఇష్ట లింగా పూజా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామంలో జాకన్‌పల్లి మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ షటస్థల బ్రహ్మ గవిసిద్ద లింగ మహాస్వామి అధ్వర్యంలో ఇష్టలింగా పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం స్వామివారికి పాదపూజ సామూహిక ఇష్టలింగ పూజా గ్రామస్థులు నిర్వమించారు.ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి భావన కలిగి ప్రేమాభిమానాలతో మెలగాలని చెడు అలవాట్లకు చెడు సావాసాలకు దూరంగా ఉండాలని గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభతో కలిసికట్టుగా మెలగాలని గ్రామ ప్రజలను ఉద్దేశించి ప్రవచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు జగదీశ్వర్ స్వామి న్యాయవాది


భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న మఠాధిపతులు

బస్వరాజ్,శాంతికుమార్,గోవర్ధన్‌రెడ్డి,లింగారెడ్డి,గ్రామ సర్పంచ్ రాజు,ఉపసర్పంచ్ పురుషోత్తంరెడవ్వ,భైరం గుండప్ప,దుబ్బ భీమ్‌రెడ్డి,వన్నె బస్వరాజ్,గాండ్ల బసవరాజ్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల ఆలయ వార్షికోత్సవాలు


ఆలయ వార్షికోత్సవాలలో పాల్గొన్న పలువురు నాయకులు

**కొత్తూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో గ్రామ దేవతల రెండవ ఆలయాల వార్షికోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం శ్రీమైసమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషార్చనలు, సర్వతోభద్ర మండలార్చన, అష్టోత్తర శతకలశ స్థాపన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్‌తో పాటు మాజీ కౌన్సిలర్ మాదారం హైమావతి నరసింహ గౌడ్, బండి మనీలా కృష్ణ దంపతులు, మాసుల అండాలు అంజయ్య దంపతులు, వడ్ల వాణి విష్ణుచారి దంపతులు యాగంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి నాగరాజ్ శర్మను ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవానికి హాజరైన భక్తులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ.. కొత్తూరు మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతలను ప్రార్థించినట్లు తెలిపారు.

గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షి  ంచారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాండగూడెం వేణుగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కడెంపల్లి సదానందం గౌడ్, కమ్మరి జనార్ధన్ చారి, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీలు బ్యాగరి యాదయ్య, జంగ గళ్ల కృష్ణయ్య, మాదారం అనురాధ కృష్ణ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, కర్రోళ్ల సురేందర్, కర్రోళ్ల లక్ష్మయ్య, మాసుల లక్ష్మయ్య, శంకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జంగ గళ్ల శివకుమార్, వడ్ల బాలరాజ్, శ్రీను ముదిరాజ్, రవి నాయక్, మేకల రాఘవేందర్ యాదవ్‌తో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.


యాగంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



చేవెళ్ల ఎస్ఐ శిరిషను సన్మానించిన నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

## రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలి

**చేవెళ్ల, అగస్టు 18, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా మోటర్ వెహికిల్ ఇన్స్‌స్పెక్టర్ శీతల్ సూచించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అట్లాస్ మినీ ఫంక్షన్ హాల్ చేవెళ్ల టూర్స్ అండ్ ట్రావెల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. చేవెళ్ల ఎస్ఐ శిరిషను నూతనంగా ఎంపికైన సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ శీతల్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్‌లు జాగ్రత్తగా వాహనాలు నడుపాలన్నారు. వాహనంకు సంబందించిన ఆర్‌సి,లైసెన్స్,ఇన్సూరెన్స్, పోల్యూషన్ తదితర పత్రాలు డ్రైవర్ వద్ద ఉండాలన్నారు. సిగ్నల్స్‌ను అదిగమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను కుర్చోపెట్టితే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్‌లు తప్పకుండా యూనిఫాంను వెసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎస్ఐ శిరీష ఆర్టిఓ అధికారులు శ్వేతా, సాదిక్, తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ నాయకులు వెంకటేష్, బాల్ రెడ్డి, పి సురేష్ కుమార్, పి గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, దిలీప్ వరకుమార్, కృష్ణ, ప్రణయ్, శ్రీకాంత్, సత్తిరెడ్డి,కరుణాకర్, కటికే పాండు తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల ట్రావెల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కనకమామిడి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక..**

చేవెళ్ల మండల ట్రావెల్ ఓనర్స్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కనకమామిడి శ్రీనివాసరెడ్డిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా డి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా శ్రీశైలం గౌడ్, జాయింట్ కార్యదర్శిగా రాజేందర్ గౌడ్, కోశధికారిగా రవీందంర్,సభ్యులుగా డి ఆంజనేయులు, శీను, విజయ్‌లను నూతనంగా ఎన్నుకున్నారు.

**తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా సౌజన్యంతో**

## వెల్చాల్ ఆంజనేయులుకు కవిగా సన్మానం

**మోమిన్‌పేట్, ఆగస్టు 18. ప్రభాతవార్త:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో మంగళవారం నగరంలోని రవీంద్రభారతిలోనక్కా శ్రీనివాస్ రచించిన "మట్టి....మహిళ....మనిషి" అనే కవితా పుస్తకావిష్కరణ సభలో జరిగిన కవిసమ్మేళనంలో కవిగా నన్ను ఆహ్వానించి సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సంధర్బంగా అవుసలి ఆంజనేయులు ప్రభాతవార్తతో మాట్లాడుతు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రస్తుతం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం వెల్‌చాల్ గ్రామానికి చెందిన ఒక సామాన్యమైన మధ్య తరగతి కుటింభంలో పుట్టి వెల్‌చాలన గ్రామంలోనే ప్రాథమిక విధ్యనభ్యసించి అనంతరం మోమిన్‌పేట్ జి.ప, ఉన్నత పాటశాలలో పదవ తరగతి వరకు చదివి తదుపరి హైదరాబాద్ నగరంలోని మూసాపేటలోని ఓ పరిశ్రమలో ఉపాదికోరకు పనిచేస్తు జీవనం సాగిస్తూ, సమయం దొరికినపుడు చిన్న చిన్న కథలు, నాటకాలకు సంహాదించి రచనలు వ్రాస్తూ,చిన్న చిన్న స్క్రిప్టులు ఇచ్చేవాడిని. అంతలో దూరదర్శన్ కేంద్రంలో నాటకాలు, ఆపై కొన్ని సినిమాలు కూడా నన్ను ఆవ్హానించడంతో నేడు ఏ కార్యక్రమం జరిగినా వెల్‌చాల్ అవుసలి ఆంజనేయులు అనే గుర్తింపుకు నా గురువులు, తల్లితండ్రులు, ఆంజనేయ స్వామి ఆశిస్సులతో ఈ స్థాయికి ఎదిగానని ఆంజనేయులు తెలిపారు.

## వ్యసన రహిత సమాజం కోసం పాటుపడాలి

**-బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సంతోష్ పిలుపు**

**చేవెళ్ల, అగస్టు 18, ప్రభాతవార్త :**

చేడు వ్యసనాలక ఎంత దూరం ఉంటే అంత మంచిదని, వ్యసన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సంతోష్ అన్నారు. చేవెళ్ల బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియం,డిగ్రీ కళాశాల, శ్రీ చైతన్య వివేకానంద్ కళాశాలలల్లో వ్యసన విముక్తికి ప్రజల్లో అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సంతోష్ మాట్లాడుతూ సమాజంలో నేటి యువత వ్యసనాలకు లోనై విలువైన జీవితాన్ని కోలోతున్నారన్నారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ముఖ్యంగా యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి



చేవెళ్ళలోని పలు కళాశాలల్లో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ చేసిన బ్రహ్మా కుమారీస్ నిర్వాహకులు సంతోష్

ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మరీస్ ప్రతినిధులు బాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, వేణుగోపాల్, పాండు యాదవ్, గోపాల్, భాగ్యలక్ష్మి, శశికళ,ప్రభుత్వ , ప్రైవేటు కళాశాలల అద్యపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చేయూత

**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యువజన సంఘం నాయకులు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన సుక్క రాములు గౌడ్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు.సుక్క రాములు గౌడ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబంలో ముందుగా అనారోగ్యంతో ఆయన భార్య మృతి చెందగా, కొద్ది రోజులకే కల్లు గీస్తూ చెట్టుపై నుంచి కిందపడటంతో రాములు గౌడ్ కూడా మృతి చెందారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన వారి పిల్లలు అనాథలుగా మారారు.ఆ సమయంలో షాద్‌నగర్‌కు చెందిన సర్దార్ పాపన్న గౌడ్ యువజన సంఘం నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చి, షాద్‌నగర్ గౌడ బంధువుల సహకారంతో ఆర్థిక సహాయం అందించారు. ఆ నగదును రాములు గౌడ్ కుమార్తె సుక్క చందన పేరుతో ఆమనగల్ మండలంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ తీసుకున్నారు. బాండ్ కాలపరిమితి ముగియడంతో ఆ మొత్తాన్ని తిరిగి చందనకు అందజేశారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నియోజకవర్గ గౌడ నాయకుల ఆధ్వర్యంలో సుక్క చందనకు రూ.1,00,000 విలువైన చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన యువజన సంఘం నాయకులను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు ఎడ్ల శ్రీకాంత్ గౌడ్, భానుచందర్ గౌడ్, మహేందర్, శ్రీనివాస్, మణి, సాయి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నాం

**షాద్‌నగర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** పట్టణంలో నీటి ఎద్దడి నివారణ కోసం ప్రతిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు, రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 22వార్డులో నీటి ఎద్దడి నివారణ కోసం నూతన బోర్ మోటార్ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో 22వార్డు కౌన్సిలర్ అనితా రఘునాథ్ యాదవ్, శ్రీశైలం గౌడ్, మున్సిపల్ ఏ ఇ ఇలియాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


నీటి ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్